1

" ప్రేమంటే...? "

" వెన్నంటే స్నేహం...మిన్నంటే మోహం..."

" ఇంకో మాట..."

" ఒక పరవశం...మనసు మరొకరి వశం.."

" ఇంకో.."

" తీయని దాహం...మనసు ఇచ్చినవారికి ఇష్టంగా దాసోహం....నచ్చినట్లు, తోచినట్లుగా ప్రేమ గురించి ఎన్నయినా నిర్వచనాలు చెప్పుకోవచ్చుగానీ, ఇంకా ఇంకా అని కొసరుతుంటే చెప్పటానికి ఇక స్టాకు లేదు...! "

" మీ మనసు తీపి మాటల ఊట బావి అనుకున్నానే...! "

" నయమే, ఊటబావీ, మోటబావీ ఏం కాదు ! అయితే, ఈ మధ్య ఒకరి పరిచయ భాగ్యంతో, ప్రేమ గురించి ఆలోచనలు మొదలవటం వలన ఈ నాలుగు మాటలూ చెప్పగలిగాను. అయినా 'మీకు...ప్రేమ..అలాంటి అనుభవం ఎదురైందా ?' అని నేను అడిగితే, జవాబు చెప్పకుండా.. 'ప్రేమంటే ఎమిటీ' అని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు ! "

" మీ ప్రశ్న సరిగా అర్ధంకాకనే ఈ ఎదురు ప్రశ్నలు....ప్రేమ గురించి తెలియనివాళ్ళూ, ఆ అనుభూతి పొందనివాళ్ళూఎవరైనా ఉంటారా...?"

" అంటే..? "

" పుట్టినప్పటినుండీ అమ్మా-నాన్నల ప్రేమలో తలమునకలవుతూంటాం ! తరువాత మన తోబుట్టువులు, బంధువులు, స్నేహితులు...ఇలా ఎంతో మంది ఆత్మీయుల ప్రేమానురాగాల్ని పొందుతూనే ఉంటాంకదా...?"

" అదీ నిజమే కావచ్చుగానీ...నా ప్రశ్నకి మీ సమాధానం సరియైనది కాదు. మీ ప్రశ్నకి అదే...' ప్రేమంటే ?' అనడిగారుగా, నా సమాధానాల్ని గుర్తు చేసుకుంటే...ఏం జవాబు చెప్పాలో మీకే తెలుస్తుంది. కాకపోతే మీకు సూటిగా సమాధానం చెప్పటం ఇష్టం లేదేమో..."

" అదేం కాదు. మీరు చెప్పిన వాటిల్లో 'వెన్నంటే స్నేహమనే' మాట నాకు బాగా నచ్చింది"

" అయితే నా ప్రశ్నని ఇంకో విధంగా మారుస్తాను. మన జీవితం ఓ ప్రయాణం అనుకుంటే, మన అమ్మా నాన్నలు కొంతదూరం వరకే మనతో వచ్చి, ఇంకెవరో చేతికి మన చేయి కలిపి ముందుకు సాగమంటారు. అదే పెళ్ళి ! అలా మీకు

తెలిసినవాళ్ళు ఎవరితో అయినా కలిసి ప్రయాణం చేద్దామని అనిపించిందా ? అంటే లవ్ లో పడటం, లేక ఎవరయినా మిమ్మల్ని లవ్ చేశానని చెప్పటం...జరిగిందా అని నా ప్రశ్న ! "

" ముందు ఓ మాట. లవ్ లో పడటం, లవ్ చేయటం...ఎందుకోగానీ ఈ రెండు పదాలూ నాకు అస్సలు నచ్చవు. ఒక చిన్న పదంలోనే రెండు భాషలు కలవటంవలనే అయివుండొచ్చు. ప్రేమ, ఇష్టం...లాంటి చక్కని మాటల్ని ఉపయోగించవచ్చు కదా అనిపిస్తుంది ! "

" ఒక చిన్న అభ్యర్ధన, చెప్పనా...?"

" అది ఏమిటో అడగకుండా, అనుమతి కోసం ఇంకో ప్రశ్నా ? నిక్షేపంలా అడగండి. నాకు తోచిన సమాధానం చెబుతాను..."

" మీరు అంటే ఒక వ్యక్తికి చాలా ప్రేమ అనుకోండి. మీతో చెప్పాలనుకునీ చెప్పలేక తటపటాయిస్తున్న పరిస్థితి గమనించి....మీ అభిప్రాయాన్ని మీరే ముందుగా తెలియజేయాలనిపిస్తే...ఏ విధంగా చెబుతారు ? ఒక క్షణం అలా వూహించి...కేవలం సరదా కోసమే ...ఎలాంటి మాటలతో చెబుతారో తెలుసుకోవాలనే కుతూహలంతోనే అడుగుతున్నాను. మీకు ఎందుకు చెప్పాలీ అంటే...నా దగ్గర సమాధానం లేదుగానీ, తెలుసుకుందామనే కోరిక వుంది ! "

" మీకలాంటి కోరిక ఉంటే, నాకేం ఇబ్బంది లేదు, చెబుతాను. నేనేదో కవితాత్మకంగా, మధురమైన బాషలో చెబుతానని మీరనుకుంటే, మీకు ఆశాభంగమే ! అవును...చాలా మాములుగా, ఎలాంటి సంకోచం లేకుండా చెప్పగలనని అనిపిస్తోంది..." అంటూ అవని చిరునవ్వుతో ఒక క్షణం మౌనంగా వుండి, తర్వాత గొంతు సవరించుకుని మెల్లగా మొదలుపెట్టింది.

" ఇన్నాళ్ళ మన పరిచయంలో మీ వ్యక్తిత్వంపట్ల నేను ఒక అంచనాకి వచ్చాను. మీ పట్ల ఇష్టం పెరిగింది. ఎంతగా అంటే....

మీతో కలిసి జీవితాన్ని పంచుకుంటే, చాలా సౌకర్యంగా, హాయిగా వుంటుందనిపించేంత ! మీకూ నా పట్ల అలాంటి ఇష్టమే ఏర్పడిందనీ...కానీ...ఎందుకో ఆ మాట సూటిగా చెప్పలేక ఏదో ఇబ్బంది పడుతున్నారేమోననే ఆలోచనతో నేనే ఈ విషయం ప్రస్తావిస్తున్నాను. నేనే ఎందుకు చెప్పాలీ అనే సంకోచం, భేషజం రెండూ నాకు లేవు !

ఇంకో మాట. నా పెళ్ళి విషయంలో నాకు నచ్చటం అనేదే ముఖ్యమైనా, మా పెద్దవాళ్ళ అంగీకారమూ అవసరమేనని నేను భావిస్తాను. మన ఇరువైపుల పెద్దలకూ అంగీకారం కాకపోతే, వాళ్ళు చెప్పిన కారణాలు మనకూ సమంజసంగా అనిపిస్తే, వాటి గురించీ ఆలోచిద్దాం. ఆ కారణాలు మనకు నచ్చకపోతే, వాళ్ళని ఒప్పించటానికి ప్రయత్నిద్దాం. ఒకవేళ

మీకే నా ప్రతిపాదన ఇష్టం లేకపోతే, ఆ విషయం చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు. మనకు నచ్చినవాళ్ళు మనల్ని కాదన్నా కృంగిపోవాల్సిన అవసరం లేదు ! మనకి నచ్చేవాళ్ళే కాదు, మనల్ని మెచ్చేవాళ్ళూ ఉంటారు, ఎదురుచూద్దామని మనస్సుకు నచ్చచెప్పుకోవాలని నా అభిప్రాయం ! అంతేగానీ...నన్ను కాదనటం ఏమిటీ అనే అహం, కోరుకున్నది దొరకలేదే అనే ఆవేదనా ...రెండూ అనవసరమే !

ప్రేమకీ, పెళ్ళికీ ఇద్దరి అభిప్రాయాలూ ముఖ్యమనే అవగాహన, గౌరవం ఉండాలి ! అవునా ? అప్పుడు ఆసిడ్ దాడులు, దురహంకార హత్యలూ జరగనే జరగవు ! ఇది ఎక్కువగా టీనేజి వయసు ప్రేమలకే వర్తిస్తాయనుకోండి.

మనకి వయసును బట్టి మానసిక పరిపక్వతా, ఆ పైన అవసరమైన ఆర్థిక సుస్థిరతా కూడా వున్నాయికాబట్టి మన అభిప్రాయాలకి పెద్దవాళ్ళూ విలువ ఇస్తారు. మనమూ ఒకటిగా మాట్లాడుకోవచ్చు. అంతగా మొహమాటపడాల్సిన అవసరమేం ,లేదు !

పెళ్ళికి పెద్దల అంగీకారమూ ముఖ్యమని నా అభిప్రాయంగా మీకర్థం అయిందనుకుంటా..అందుకని...మీరు రేపొకసారి మా పెద్దవాళ్ళకి పరిచయం చేయటానికి మా ఇంటికి రాగలరా ? ఒకవేళ ఆలోచించుకోవటానికి కొంత సమయం కావాలనిపిస్తే, వీలు చూసుకుని వస్తానని చెప్పండి. ఏవో మీ కారణాలు మీకుండి, ఇష్టం కాకపోతే, కుదరదని చక్కగా చెప్పేయచ్చు !

పెద్దవాళ్ళు కూడా పెళ్ళిచూపులంటూ ఎవరినో మన ముందుకు తీసుకువచ్చి, ఇష్టమేనా అనడుగుతారు. కొన్ని సంబంధాలు అంతవరకూ రాకుండానే మిగతా విషయాలవల్ల తెలిపోతాయి. ఆ కొద్ది సేపట్లోనే మనకు ఇష్టం, నమ్మకం కలిగితే అవునంటాం, లేకపోతే లేదు.

ఏ కారణంతోనైనా ఆ సంబంధం కుదరకపోతే వెంటనే ఇంకో దానికోసం ప్రయత్నం మొదలుపెడతారు. మనకి నచ్చిన సంబంధం చేజారిపోతే, తప్పదు... మనసు కూడదీసుకుని నిబ్బరంగా ఉండటానికి ప్రయత్నం చేయాల్సిందే.

అలాగే ప్రేమ విషయంలోనూ, ఫలించకపోతే అదే చేయాలని నా అభిప్రాయం. అబ్బో....మీరడిగిన చిన్న ప్రశ్నకి పేజీలకొద్దీ జవాబు చెప్పినట్లున్నాను " అంటూ నవ్వి " సరేగానీ, ఇప్పుడు చెప్పండి...మీరు రేపు మా ఇంటికి రాగలరా ? ఇష్టమేనా ?" అంది అవని.

సుభాష్ " ఓ..." అంటూ లేచి నిలబడి " రేపటివరకూ ఎందుకూ...ఈ క్షణమే అయినా వచ్చేస్తాను ఆనందంగా.." అని మరుక్షణమే నిట్టూర్చాడు. నుదురు మీద అరచేతితో కొట్టుకుని " చూశారా...ఊహించి చెప్పమని అడిగాననే మాటే మర్చిపోయానూ..." అన్నాడు చిరునవ్వుతో.

అవని కూడా చెంపకు చేయి ఆనించుకుని అతని వేపు చిరునవ్వుతో చూసింది.

" నేను మాత్రం...ఆ సందర్భాన్ని వూహించుకుని చెప్పలేదు. మీరు నిజంగానే సూటిగా చెప్పలేక అలా అడుగుతున్నారేమోననుకుని...నా మనసులోని మాటను నిజంగానే చెప్పాను ! "

అతని వేపు అలాగే సూటిగా చూసి " నా మాటలు నిజమేనని చెప్పాగా...ఇప్పుడు మళ్ళీ మీ సమాధానం...అదేనా..ఏమైనా మార్పుందా ?" అంది.

సుభాష్ ఒక క్షణం మౌనంగా వుండిపోయేసరికి అవని " ఏమిటీ...మాట్లాడటం లేదూ, మీ సమాధానం ఏమైనా ఫర్వాలేదనీ, నేనేం కృంగిపోకుండా మామూలుగానే ఉంటాననీ ముందే చెప్పానుగా. నేనే పొరబడ్డానా అనే అనుమానం వస్తోంది ! " అంది.

సుభాష్ చిన్నగా నవ్వాడు.

" మీ మాటలు నిజంగా నిజమేనని నమ్మటానికీ, ఆనందంతో ఎగిరి గంతులేస్తున్న మనసును కుదురుగా కూర్చోబెట్టి, మాటలు కూడదీసుకోవటానికీ ఇలా రెండు క్షణాల సమయం అవసరం అయింది ! నిజంగానే మీ మనసు తెలుసుకోవాలనే అలా అడిగాను. మీరు బాగానే కనిపెట్టారు ! అనుకోకుండా ఇందాకనే చెప్పాను...వేరేగా మళ్ళీ చెప్పటం ఎందుకూ ?"

అవని కొంచెంగా కళ్ళువాల్చుకుని లేచి నిలబడి " సరే...అయితే..రేపు మీరు మా ఇంటికి వస్తారని ఇంట్లోవాళ్ళకి చెబుతాను. వాళ్ళకీ చూచాయగా విషయం అర్థమవుతుంది ! " అంది ముసిముసి నవ్వుతో.

" కాదు..కొంచెంసేపు కూర్చోండి. ఇన్నాళ్ళూ మిమ్మల్ని చూడటం, మాట్లాడటం వేరు. ఇప్పుడు ...మనమిద్దరం ఒక నిశ్చయానికి వచ్చాక ...మిమ్మల్ని ఇష్టంగా చూస్తూ , మనసారా నాలుగు మాటలు మాట్లాడటం బావుంటుంది...ఇంతకన్నా గొప్పగా చెబుదామని అనుకున్నా వీలు కావటంలేదు మరి..." అంటూ నవ్వాడు.

" సరే..." అంటూ కూర్చున్న అవని చిరునవ్వుతో " చెప్పండి.." అని తనకి అలవాటైన పద్ధతిలో ఒక పక్కగా తిరిగి దూరంగా కనిపిస్తున్న చెట్ల వేపు చూపు తిప్పింది.

సుభాష్ అప్రయత్నంగా " అద్భుతం " అనేసరికి అవని ఆశ్చర్యంగా అతనివేపు చూసి ఏమిటని అడుగుతున్నట్లుగా చేతిని వూపింది.

సుభాష్ సరదాగా నవ్వుతూ " నా కంటి కెమెరాకి ఓ అపురూపమైన దృశ్యం చిక్కేసరికి అప్రయత్నంగా అలా అనేశాను ! మనమధ్య ఏర్పడిన బంధం వలన కాబోలు...ఇప్పుడు మీరు కూర్చున్న భంగిమ చాలా అందంగా అనిపించింది..! " అన్నాడు.

అవని ఏం మాట్లాడలేనిదానిలా ఒకసారి అతనివేపు ఇష్టంగా చూసి కొంచెంగా కళ్ళు క్రిందికి వాల్చింది. అతను " అవునూ..." అంటూ ఏదో చెప్పబోతోంటే అడ్డం వచ్చి " అవును...కాదు..నా పేరు అవని..." అంది చిరునవ్వుతో.

సుభాష్ పెద్దగా నవ్వాడు. " నాది పాజిటివ్ థింకింగ్ అని చెప్పటానికన్నట్లుగా ఇలా ' అవునూ' అంటూ మొదలుపెట్టి మాట్లాడటం అలవాటయిందనుకుంటా. మా బంధువుల్లో ఒకాయన అయితే ' అది కాదూ..' అంటూ మొదలుపెడతాడు. రకరకాల అలవాట్లు ఉంటుంటాయి..."

అతని మాటల మధ్యలో అడ్డం వచ్చి " అది సరేగానీ...ఇంతకీ మీరు చెప్పబోయిందేమిటీ ? ఈ ఊతపదాల ఉదంతంతో టాపిక్ మారిపోయింది. నేనే మీ మాటలకు అడ్డం వచ్చినట్లున్నా..వెళ్ళబోతోంటే, మళ్ళీ కూర్చోబెట్టారుగా ! " అంది.

" మీకూ, 'అది సరేగానీ' ..అంటూ మొదలుపెట్టే అలవాటుందన్నమాట ! ఇప్పుడే గమనించాను. ప్రత్యేకంగా ఏదో మాట్లాడాల్సిన విషయం ఉందనీ, కాసేపు ఉండమనీ అడగలేదు. ఏదో సరదాగా ఇంకొంచెంసేపు కాలక్షేపం చేయాలని...అంతే. అవునూ...రేపు నేను మీ ఇంటికి ఏ టైములో రమ్మంటారో చెప్పండి. లేకపోతే, మీ రోజువారీ కార్యక్రమ వివరాలు సరదాగా చెబితే, నాకు అంతా ఖాళీయే కాబట్టి, మీకు అనువైన సమయమేదో అర్థమై, ఆ టైములో వస్తాను "

అవని ఒక నిమిషం మౌనంగా ఉండి..తర్వాత కొంచెం పెద్ద గొంతుతో " ఇక లేవండీ " అంది.

సుభాష్ ఉలిక్కిపడి వెంటనే లేచి నిలబడి " ఎ...ఎందుకూ...? " అని అడిగాడు కొంచెం తత్తరపడుతూ.

" మీరు మా రోజువారీ కార్యక్రమ వివరాలడిగారు కదా...అది మొదలుపెట్టాను. ఆ పిలుపు వెనక తలుపు దబదబమనే శబ్దం వినిపించి అందరం నిద్రనుండి లేస్తామన్నమాట ! "

" అంటే...అలా వినిపించే అలారం సెట్ చేసుకున్నారా ?" మధ్యలో అడ్డం వచ్చాడు.

" కాదు..." అంటూ అవని తల అడ్డంగా ఊపింది. " నా ఫ్రెండ్ అలా పిలుస్తుంది ! ఒక్కోరోజు ఆ పిలుపు ఒకలా వుంటుంది.. ' తెల్లారిపోయిందనో, తలుపు తీయండి అమ్మా' అనో పెద్దగా అరుస్తుంది. ఆ అరుపుకి మేం మాత్రమే కాదు, మా ఇరుగుపొరుగువాళ్ళూ నిద్రలేస్తారనుకుంటా " అంది చిరినవ్వుతో.

" అవునూ...మీ ఫ్రెండ్ అంత పొద్దున్నే ఎందుకూ రావటం ? " అడిగాడు.

" తనే గిన్నెలు కడగటం, వాకిలి ఊడ్చటంలాంటి పనులు చేస్తుందికాబట్టి ! "

" ఏమిటీ..మీ ఫ్రెండా ? "

" అంటే...పూర్తిగా చెబుతానుండండి. మా నాన్నగారు క్రిందటి సంవత్సరం రిటైరు అయ్యారు. ఇంతకుముందు నేను ఎలిమెంటరీ క్లాసులో ఉన్నప్పుడు నాన్నగారు ఇక్కడకే ట్రాన్సఫరు మీద వచ్చారు. అప్పుడు మేం ఇక్కడే ఎక్కువ సంవత్సరాలున్నాం. దాంతో ఈ ఊరు, పరిసరాలూ బాగా అలవాటయ్యాయి. ఇష్టమూ ఏర్పడింది. ఇప్పుడు నాకూ ఉద్యోగరీత్యా ఈ చుట్టుపక్కల ఊళ్ళు తిరగాల్సి ఉండటంతో ఈ మధ్యే అమ్మకానికి వచ్చిన ఇల్లును కొనేశాం. క్యాంపులకీ, హెడ్డాఫీసు వైజాగ్ కీ వెళ్ళిరావటానికీ అనువుగా వుంది. మేం ఇంట్లో చేరిన కొత్తలో అమ్మావాళ్ళూ పనికి ఎవరినో కుదుర్చుకున్నారు. తను నా క్లాస్ మేట్. నేను అప్పుడే ఆఫీసునుండి వచ్చా.

మేం ఇద్దరం ఒకరినొకరం గుర్తుపట్టి , చిన్నప్పటి రోజుల్ని నెమరేసుకున్నాం. తర్వాత తన సంగతులు చెప్పింది. సెవెంత్ క్లాసుతో చదువు మానెయ్యాల్సి వచ్చిందంట. వాళ్ళమ్మమ్మ గారి ఊరెళ్ళిపోయింది. అమ్మ తమ్ముడితో పెళ్ళయింది. ఇద్దరు చిన్నపిల్లలు కూడా. ఆ సంవత్సరమే తండ్రి చనిపోవటంతో అమ్మ కూడా వాళ్ళతో కలిసి ఉంటోందికాబట్టి పిల్లల్ని చూసుకునే పనిలేకపోవటంతో , అంతంత మాత్రపు భర్త సంపాదనకు తనూ పని చేస్తే, బావుంటుందనుకుందంట...అదీ విషయం. పనులు చేయటం అదే మొదలని చెప్పింది.

పనీ, జీతమూ కూడా నచ్చాయి కాబట్టి ఇంకో ఇల్లు చూసుకోనని చెప్పింది. నిజానికి చిన్నప్పుడు తను నా క్లాస్ మేట్ మాత్రమే...ఈ మధ్యనే మా ఇద్దరిమధ్యా మంచి స్నేహం ఏర్పడింది. నాతోనే కాదు, ఇంట్లోవాళ్ళందరితో కూడా బాగా కలిసిపోతుంది. పనీ చక్కగా చేస్తుంది. అందుకే నేను రెండురోజులు ఇంట్లోలేకపోయినా మా వాళ్ళకి అంత వెలితిగా అనిపించదుగానీ, వరాలు రాకపోతే మాత్రం బెంగ పెట్టేసుకుంటారు ! తన పేరు వరాలమ్మ. ' వరాలూ ' అంటాం..." అంది అవని చిరునవ్వుతో.

" బావుంది.." అని చిరునవ్వుతో..." మీ ఇంట్లో ఎంతమంది, ఎవరెవరు వుంటారూ...? అని అడిగాడు.

" అమ్మా నాన్నలతో పాటు అమ్మమ్మా, నాన్నమ్మా వుంటారు. తమ్ముళ్ళిద్దరూ చదువుకుంటున్నారని చెప్పాగా. సాధారణంగా ఎవరింట్లోనైనా నానమ్మ, తాతయ్యలే ఉంటుంటారు. ఇద్దరూ అంటే అమ్మమ్మా, నాన్నమ్మా కూడా మాతో ఉండటం ఒక విశేషమే. అదీ చెబుతా.

మా నాన్నగారికి అన్నదమ్ములు లేరు..ఒక చెల్లెలు ఉంది.."

" అవును..మీరు కమలత్త అంటారు..." మధ్యలో అందుకుని అన్నాడు సుభాష్.

" మీకు....చెప్పినట్లు గుర్తులేదే..ఎలా తెలుసూ..?" ఆశ్చర్యపోయింది అవని.

" మంత్ర మహిమ...కొన్ని విషయాలు అలా తెలుస్తూంటాయి. మా బంధువుల్లోని ఒక మావయ్య అయితే తాయెత్తు మహిమ అంటూంటాడు..." అంటూ సరదాగా నవ్వాడు.

" అదేంకాదు. అసలు విషయం...ఎలా తెలుసో చెప్పండి..."

" నాకెలా తెలుసో అది తర్వాత చెబుతా. అదేమంత ముఖ్యం కాదుగా. మీ అమ్మమ్మా, నాన్నమ్మల విషయం చెబుతున్నారుగా...అది కొనసాగించండి.." అన్నాడు.

" మా అమ్మమ్మ వాళ్ళకి మా అమ్మ ఒక్కతే. కొడుకులు లేరు. అమ్మ పెళ్ళయ్యాక, అప్పటినుండీ అమ్మమ్మ, తాతయ్యా వాళ్ళ ఊరులోనే ఉండేవాళ్ళు. నాలుగేళ్ళ క్రితం మాతోపాటు ఉండే తాతగారు చనిపోతే, క్రిందటి సంవత్సరం ఊళ్ళో వుండే తాతగారూ చనిపోయారు.

ఒక్కతే వుంటున్న అమ్మమ్మని, నాన్నమ్మే మా ఇంటికి తీసుకువచ్చింది. మా అమ్మమ్మ రానని చాలా మొండికేసింది. చుట్టుపక్కల చుట్టాలంతా వున్నారు, ఒంటరితనమేమీ లేదని అంది. దానికి మా నాన్నమ్మ ఎలా గదమాయించిందో తెలుసా ? "

అప్పుడు నేనూ మా అమ్మమ్మా వాళ్ళ ఊరు నాన్నమ్మతో పాటూ వెళ్ళాను. ' చుట్టుపక్కల చుట్టాలు వున్నారు నిజమే, కానీ, అక్కడైతే ఇంట్లోనే కూతురూ, అల్లుడూ, మనవలతోపాటూ నేనూ ఉంటాను. చుట్టుపక్కలకంటే, ఇంట్లోనే ఇంతమందిమి ఉంటే, ఇంకా బావుండదూ ? " అని ఆ తర్వాత చక్కగా నచ్చచెప్పింది.

' మొక్కా మోడూ చూసుకోవటానికీ, తోడుగా వుంటారనీ, ఆ గదులు మీ బంధువులెవరికో ఇచ్చావా...ఇప్పుడు ఈ భాగాన్నీ అప్పుడప్పుడూ శుభ్రం చేస్తూండమని వాళ్ళకే పురమాయిస్తే సరి ! ఏపైనా పండగలొచ్చినప్పుడు, మనవలకి సెలవలప్పుడు సరదాగా అందరం ఇక్కడికొచ్చి నాలుగు రోజులు ఉండి వెళ్ళొచ్చుకూడానూ ! అప్పుడు నీకూ ఇల్లూ వాకిలీ చూసుకున్నట్టూ, చుట్టాలందర్నీ పలకరించినట్లూ ఉంటుంది ! నీకెప్పుడు అక్కడ బావుండలేదనిపిస్తే, అప్పుడే వచ్చేయ్యి. ఎవరం కాదనం...సరేనా ?' అంది. దాంతో మా అమ్మమ్మ ఇక ఏం మాట్లాడకుండా అన్నీ సర్దేసుకుని ఆనందంగా మా ఇంటికి

వచ్చేసింది. "

" సాధారణంగా పెద్దవాళ్ళ కాలక్షేపాలూ, అభిరుచులూ ఒకే విధంగా ఉంటుంటాయి. అందుకే సామరస్యంగా వున్నారనుకుంటా..."

అవని చిన్నగా నవ్వింది. " అదేంకాదు. ఇద్దరి అభిరుచులూ, కాలక్షేపాలూ వేరువేరే ! మా అమ్మమ్మ గుడికెళ్ళిరావటం, ఇంట్లో పూజా పునస్కారాలూ, భజన కీర్తనలు పాడుకోవటం చేస్తూంటుంది. నాన్నమ్మకేమో సినిమాలు, పేపరు పుస్తకాలు తిరగెయ్యటం, తెలిసిన వాళ్ళు నలుగుర్నీ కలిసి రావటం...ఇవన్నీ ఇష్టం !

కబుర్లు చెప్పుకునే విషయం మాత్రం ఇద్దరికీ ఇష్టమే . నాన్నమ్మ పేపర్లోని సంగతులు చెబితే, అమ్మమ్మ గుళ్ళో కబుర్లు ఏకరువు పెడుతుంది ! కాకపోతే, ఎప్పటెప్పటివో, ఎవరెవరో బంధువుల సంగతులన్నీ సరదాగా తిరగేసుకోవటమూ జరుగుతూంటుంది ! "

" నిజంగా ఇద్దరూ అంత సఖ్యంగా ఉండటం చాలా గొప్ప విషయం!"

" అవును. ఇతరుల కారణంగా అపోహాలు తమమధ్య ఏర్పడకుండా చూసుకోగల సంస్కారం ఇద్దరికీ ఉంది ! ఒకసారి మా అమ్మమ్మను చూడటానికి తనకి తెలిసిన వాళ్ళెవరో వచ్చారు. అప్పుడు అమ్మమ్మ చేటతో ఏదో బాగుచేస్తూ పనిలో ఉంది.

నాన్నమ్మ గదిలో పడుకుందనుకుంటా. భోజనం అయ్యాక తప్పనిసరిగా కాసేపైనా పడుకుంటుంది. ఆ వచ్చిన ఆవిడ అమ్మమ్మతో గుసగుసగా ' ఎంతైనా మీ వియ్యపురాలు తెలివైనదే. అభిమానం చూపించినట్లుగా ఇంట్లోకి తెచ్చి పెట్టుకుని చాకిరీ అప్పగించింది నీకు చూడు. తనేమో చక్కగా కునుకు తీస్తోంటే, నువ్వేమో చేట చీపురుతో పేళ్ళాడుతున్నావు ! ఆవిడదెంత ధాటీనో మాటల్లోనే తెలిసిపోతూంటుంది ! నువ్వేమో వినయంగా 'వదినగారూ' అంటావ్...ఆవిడేమో నిన్ను 'పార్వతమ్మా' అంటుంది ! ఇందులోనే తేడా తెలియటం లేదూ ? అంది.

దానికి అమ్మమ్మ ' నన్నెవరైనా వరసతో కంటే పేరుతో పిలవటమే నాకు ఇష్టం. అందుకే మా అమ్మాయి పెళ్ళయ్యాక ఆవిడ కూడా నన్ను ' వదినగారూ ' అంటోంటే, నచ్చక చిన్నదాన్ని కదా, పేరుతోనే పిలవండని చెప్పా. అందుకనే అప్పటినుండీ, అలా పిలవటం అలవాటై, ఈ మధ్యలో పార్వతమ్మా అంటున్నారూ ' అని చెబుతూంటే, నాన్నమ్మ గదిలోంచి వచ్చింది.

అమ్మమ్మ కోసం వచ్చినావిడకు నాన్నమ్మ స్వభావం తెలియబరచాలనే ఉద్దేశ్యంతోనే కాబోలు నాన్నమ్మతో అమ్మమ్మ ' ఏమిటో వదినగారూ...ఇందాకటినుండీ తలనొప్పిగా వుందీ ! ' అంది.

' మధ్యాహ్నం కాసేపు నడుం వాల్చవమ్మా అంటే, నిద్ర రాదంటూ ఏదో పని పెట్టుకుంటావ్ ! వచ్చిన ఆవిడతో చక్కగా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయకుండా ఈ పని నీకెందుకు చెప్పూ ! పుదీనా, అల్లం కొంచెం ఎక్కువ వేసి, టీ పెట్టుకువస్తానుండు...తాగితే కొంచెం బావుంటే సరే, లేకపోతే తలనొప్పికి ఏదైనా మాత్ర వేసుకుందువుగానీ...' అంటూ నాన్నమ్మ వాళ్ళ ముగ్గురికీ టీ పట్టుకు వచ్చి తనూ తాగుతూ రెండు నిమిషాలు కూర్చుని లోపలకు వెళ్ళిపోయింది.

' చూశావా, నాక్కొంచెం నలతగా ఉంటే, ఇంట్లో అందరికంటే వదినగారే ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంది ! భేషజం అస్సలు లేదు ! అంత మంచి మనస్సు కాబట్టే, ఉండగలుగుతున్నాను అనుకో ! ' అంది అమ్మమ్మ ఆవిడతో.

ఆవిడకు ఇక ఏమనాలో తోచక ' ఊ...ఊ...' అని నీలిగి ఊరుకుంది.

ఇంకోసారి ఎవరో నాన్నమ్మతో అన్నారు.. ' మీ వియ్యపురాలేమిటీ నీతో సమంగా దర్జా ఒలకబోస్తోందీ....నీ కొడుకు ఇల్లు కాబట్టి నీ పెత్తనం సాగాల్సిందే ! నీ మంచితనం గుర్తించి, అణకువగా ఉండాల్సిందిపోయి, నీకూ ఒపనులు పురమాయించటం చూస్తూంటే, తెలివితక్కువగా అనవసరమైన బరువు తలకెత్తుకునావనిపిస్తోంది సుమా ! ' అని.

నానమ్మ సరదాగా నవ్వేసింది. ' నాకు నీ మాటలే తెలివితక్కువగా అనిపిస్తున్నాయి ! లేకపోతే ఏమిటి చెప్పు...ఇది నా కొడుకు ఇల్లు అయితే...ఆవిడకు వాళ్ళమ్మాయి ఇల్లు ! అంతేగా ! ఒకరికొకరం ఆసరా...అంతే తప్ప అధికారాల ప్రశ్నేమిటీ ! పార్వతమ్మకు నేను పనులు చెప్పినప్పుడు, ఆవిడ మాత్రం నాకెందుకు చెప్పకూడదూ ? అలాంటి తేడాలేవీ లేకపోబట్టే, ఇద్దరం ఒక ఇంట్లో సుఖంగా ఉంటున్నాం' అని చెప్పింది.

ఈ రెండు సందర్భాలలోనూ నేనూ కొంచెం దూరంగా ఉండి వినగలగటంతో వాళ్ళిద్దరి మనస్తత్వాలూ, సంస్కారం ఎలాంటివో తెలుసుకోగలిగానన్నమాట ! "

అవని సుభాష్ వేపు నవ్వు మొహంతో చూసి " ఏమిటో ఈవేళ...చిన్న ప్రశ్నకి పెద్ద పెద్ద సమాధానాలు ఇచ్చేస్తున్నా. క్లుప్తంగా చెప్పటం చేతకాలేదు ! " అంది.

" మీ మాటలు విన్నాక వాళ్ళిద్దర్నీ ఎప్పుడు కలుస్తానా అని చాలా తొందరగా ఉంది! "

" వాళ్ళిద్దరూ ఒకరి మాటల్ని ఒకరు మన్నిస్తూ సఖ్యంగా ఉంటారని చెప్పటనికి ఇంతలా వివరించానే తప్ప...వాళ్ళేం ప్రత్యేకంగా ఉండరు ! అందరిళ్ళల్లో పెద్దవాళ్ళు వున్నట్లుగానే వాళ్ళూ వుంటారు ! వాళ్ళిద్దరిపట్లా నాకున్న ఇష్టాన్ని బట్టి కూడా వాళ్ళలో మంచితనం మాత్రమే కనిపిస్తుందనుకుంటా! అది సరేగానీ....పొద్దున మామూలుగా నేను ఆఫీసుకో, క్యాంపుకో వెళ్తే, తమ్ముళ్ళిద్దరూ వాళ్ళ స్కూళ్ళకి వెళ్ళిపోతారు. అందరం సాయంకాలం అయిదు గంటలకి ఇంట్లోనే వుంటాం. నాన్నగారు బయటకు వెళ్ళినా కాసేపటిలోనే వచ్చేస్తారు ఇంటికి. ఏ సమయానికి రావాలనేగా మీ అసలు ప్రశ్న!" అంటూ నవ్వింది.

" సరే, ఇక బయలుదేరుదామా ? " అంటూ అవని లేచి నిలబడింది.

సుభాష్ కూడా తల ఊపుతూ లేచాడు.

అదొక కొత్త తరహా రెస్టారెంట్. సుభాష్ స్నేహితుడే ప్రారంభించాడు. లైబ్రరీ కం రెస్టారెంట్ లాంటిది. చుట్టూ చిన్నచిన్న అలమరాలాంటి రాక్ లనిండా తెలుగు, ఇంగ్లీషు బాషల పుస్తకాలు ఉంటాయి. వాటిలో కావాల్సినవి, నచ్చినవి ఏమైనా కొనుక్కోవచ్చు, అద్దెకి తీసుకెళ్ళవచ్చు. కాఫీ తాగుతూ ఏదైనా పుస్తకాన్నో, మేగజైన్నో తిరగేయనూ వచ్చు. అన్ని ఏర్పాట్లూ వున్నాయి.

మధ్యలో టేబుల్స్, కుర్చీలు వున్నాయి. ఆర్డరు చేసినవి సర్వర్లు తెచ్చిపెడతారు. ఈ లోపుగా అంతా తిరిగి ఏమేమి పుస్తకాలున్నాయో తెలుసుకోవచ్చు.

బయట వున్న మొక్కల మధ్య కూడా కొన్ని సిమెంట్ బెంచీలు ఉన్నాయి. ఇష్టం వున్నవాళ్ళు ఆరుబయట అక్కడ కూర్చొని పుస్తకాలు తెచ్చుకుని చూస్తూ, ఆర్డరిచ్చినవి తింటూ కాలక్షేపం చేయచ్చు. సుభాష్ ఈ రెస్టారెంట్ గురించి చెప్పి, ఆ రోజు సాయంకాలం అక్కడ కలుద్దామని అడిగినప్పుడు అతనితో వున్న పరిచయాన్నిబట్టి అంగీకరించింది.

లైబ్రరీ లా వున్న ఆ రెస్టారెంట్ అవనికి బాగా నచ్చింది. రాగానే అంతా తిరిగి చూసి, అంత మంచి ఆలోచన వచ్చినందుకు అతని స్నేహితుడిని అభినందించింది.

" నాకు ఉపాధి చూపించటంకోసం కొంత పెట్టుబడితో ఈ ఆలోచన సుభాష్ ఇచ్చిందే " అన్నాడతను. అప్పుడు అవని ప్రశంసాపూర్వక చూపులకు చిరునవ్వుతో మాత్రమే బదులిచ్చాడు సుభాష్.

కాఫీ తాగడం, కబుర్లూ పూర్తయ్యాక లేచి నిలబడిన అవని అతనితో కలిసి అడుగు ముందుకు వేసి ఒక క్షణం ఆగి, " ఈ సాయంకాలం ఒక మంచి జ్ఞాపకంగా మనసులో ఉండిపోతుంది. ఈ రెస్టారెంట్ గురించి నా ఫ్రెండ్స్ కూ చెబుతాను" అంది చిరునవ్వుతో.

సుభాష్ కూడా సరదాగా నవ్వాడు. " నా వరకూ అయితే...కేవలం మంచి అనేది మాత్రమే సరిపోదు. మధురాతి మధురమైన అనటం సరిపోతుందనుకుంటా ! ఇంకా చెప్పాలంటే, గొప్ప విజయం సాధించినంత ఆనందంగానూ ఉంది ! "

అవని సాలోచనగా చూసి " ఇందులో..విజయం ఏముందీ ..?" అంది.

*****